# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా మార్పులు రావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆకాంక్షించారు.**

**2.** **విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఇంధనశాఖ అధికారులను ఆదేశించారు.**

**3.** **రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు 48 గంటల ముందు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు.**

**4.** **తెలంగాణలోని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నిక ఈ ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు జరగనుంది.**

**5.** **ఆంధ్రప్రదేశ్‌లో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ప్రభావం పెరుగుతోందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.**

==========================

ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా మార్పులు రావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో తెలంగాణ నూతన హైకోర్టు భవన నిర్మాణానికి నిన్న ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలంలో కోర్టులు సార్వభౌమత్వాన్ని కలిగి ఉండేవని, మారిన కాలంతోపాటు కోర్టుల్లోనూ మార్పులు వస్తున్నాయని తెలిపారు. న్యాయవ్యవస్థ విలువలు పెంపొందించేలా సీనియర్లు, అనుభవం కలిగిన న్యాయమూర్తులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నర్సింహా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు.

--------------------------

వేసవి కాలం, విద్యార్థుల పరీక్షల దృష్ట్యా రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఇంధనశాఖ అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో విద్యుత్ సరఫరా పరిస్థితులపై నిన్న ఆయన ఇంధనశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వేసవి, విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముఖ్యంగా మంచినీటి సరఫరా పథకాలకు, వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. విద్యుత్ ఫిర్యాదుల కోసం రుసుము రహిత నెంబర్ 1912ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ప్రజలకు జవహర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

---------------------------

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శాశ్వత ప్రాతిపదికన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లోని రాజకీయ ప్రకటనల హోర్డింగ్‌లను తొలగించకుండా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో నుంచి నిన్న ఆయన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో దృశ్యమాధ్యమంలో సమీక్ష నిర్వహించి ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లను, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఇందుకోసం 48 గంటల ముందు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు 48 గంటల ముందు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశంలేని పక్షంలో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి, ఆ వివరాలు అన్నింటినీ ఎన్కోర్ పోర్టల్‌లో నమోదు చేసి సకాలంలో తగిన అనుమతులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలోని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నిక ఈ రోజు జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆయా పురపాలక సంఘాల కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఏప్రిల్ 2వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడిగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి శాసనసభ్యుడిగా గెలుపొందారు. ఆయన శాసనమండలికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక జరుగుతోంది.

---------------------------

ఏప్రిల్ నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల కనీస వేతనం 300 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత సంవత్సరానికి కనీస వేతనం 272 రూపాయలు అమలు చేస్తుండగా.. అదనంగా మరో 28 రూపాయలు జోడించి 2024-25 సంవత్సరానికి 300 రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్, మే నెల పింఛన్ల పంపిణీకి వాలంటీర్లు అధీకృత పత్రాలు తీసుకోవాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ.. సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల వద్ద అధీకృత పత్రం తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. పింఛను పంపిణీ సమయంలో వాలంటీర్లు ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదని.. ఫొటోలు, వీడియోలు తీయవద్దని సెర్ప్ స్పష్టంచేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

---------------------------

వేసవి కారణంగా రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ప్రభావం చూపుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటిందని తెలిపింది. ఈ రోజు వైఎస్ఆర్, నంద్యాల, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లోని 22 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రేపు 31 మండలాల్లో వడగాల్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 10 శాసనసభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. తెలుగుదేశం, జనసేన పార్టీలతో పొత్తులో భాగంగా బీజేపీకి ఆరు లోక్‌సభ, పది శాసనసభ స్థానాలు కేటాయించారు. లోక్‌సభ స్థానాలకు ఇప్పటికే అభ్యర్థుల్ని ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం శాసనసభ అభ్యర్థుల జాబితాను నిన్న విడుదల చేసింది. కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి, పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ధర్మవరం నుంచి పోటీ చేయనున్నారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాస్ కైకలూరు, ఆదినారాయణ రెడ్డి జమ్మలమడుగు, మాజీ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారు. ఆదోని నుంచి పార్థసారథి, ఎచ్చెర్ల నుంచి ఎన్. ఈశ్వరరావు, అరకు నుంచి పి. రాజారావు, బద్వేలు నుంచి రోషన్, అనపర్తి నుంచి శివకృష్ణరాజును బీజేపీ అభ్యర్థులుగా ఎంపిక చేసింది.

---------------------------

ఎన్నికల సమయంలో అప్రమత్తంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ విస్తారక్‌లతో ఎన్నికల ఇన్‌ఛార్జి అరుణ్ సింగ్, సహ ఇన్‌ఛార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్, జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో పాటు ఆమె నిన్న సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుసరించిన వ్యూహాలు, ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన విధానాలను వారికి వివరించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేసే ప్రతి అభ్యర్థి గెలుపు కీలకమేనని, బీజేపీ అభ్యర్థి విజయానికి కష్టపడిన విధంగానే మిత్రపక్షాల గెలుపునకు కృషి చేయాలని పురందేశ్వరి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ నుంచి మేమంతా సిద్ధం బస్సుయాత్రను నిన్న ప్రారంభించిన ఆయన ప్రొద్దుటూరు పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం త్రికరణ శుద్ధిగా అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా సంక్షేమం, అభివృద్ధిని గత 58 నెలల కాలంలో చేసి చూపామని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

యువత కోసం 20లక్షల ఉద్యోగాలు ఎదురు చూస్తున్నాయని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు, తిరుపతి జిల్లా పుత్తూరులో నిన్న ఆయన 'ప్రజాగళం' సభలు నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.. అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేస్తామని

హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే భారతీయ జనతా పార్టీ, జనసేనతో పొత్తు కుదుర్చుకున్నామని.. కేంద్రంలో మళ్లీ బీజేపీ  అధికారంలోకి వస్తుందని చంద్రబాబు నాయుడు తెలిపారు.

-------------------------

భారత–అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంప్–2024 విన్యాసాలు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సాగరతీరంలో నిన్న ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎక్స్ టైగర్ ట్రయంప్–2024లో సైనిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భారత్, అమెరికా దళాల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు ఈ విన్యాసాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

======================